

# ప్రశ్నార్థకం

ఈతకోట సుబ్బారావు

సుజాతకు ఆదోరకమైన సంతోషం, గర్వం.

కానీ, అవి ఎంతమాత్రం సుజాతను దాటి బయటపడేవి కాదు.

"నీవు దానకర్ణుడి చెల్లెలివే" అని స్నేహితులు హాస్యంగానూ వ్యంగ్యంగానూ అంటున్నా, పెదవి విప్పే అవసరం సుజాతకు ఏనాడూ కలగలేదు.

పేరుకోసం, ప్రతిష్ఠకోసం కాకున్నా, రోజూ స్కూలుకు వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు ఆ కుష్ఠువాడిని దాటుకొనే సరవాలి. అతను ఆ రోడ్డు ప్రక్కనే గోతం పట్ట పరుచుకొని అతను పాడే సినిమా పాటే సుజాతకు భయంకరంగా గుండె లోతుల్ని తాకుతుంటుంది. అయినా ఆ పాట వినక తప్పదు. ఆ రోడ్డమ్మట నడవకా తప్పదు. అందుకే రోజూ— ఒకటి, రెండు రూపాయలు ఆ గోతంపట్ట మీద వేసి రావటం సుజాతకు చాలా కాలంనుంచి మామూలయింది.

"ఎంతైనా నీది జాలి గుండె సుజా! అసలు నీవు రోజూ రెండు మూడు వేయటం, జీతం తీసుకొన్నప్పుడు పాతిక వరక ఇవ్వటం ఎందుకే."

స్నేహితురాలి ప్రశ్నకు చిరునవ్వే కాక "అదికాదు. మీకు రోజూ స్కూలుకు వచ్చివెళ్ళను రెండుమూడు రూపాయలు రిక్షలకు ఎలానూ అవుతుంది. నాకు స్కూలు ప్రక్కనే ఇల్లుకాబట్టి ఆ ఖర్చు లేదు. అయినా ఆ ఖర్చు ఉందనుకొనే ఆ రెండురూపాయలు అతనికిస్తాను, అంతే కాక జీతమేకాక ట్యూషన్స్‌మీద ఎంత సంపాదిస్తున్నాము మనం. అందుకే మనసుకు తోచినప్పుడు ఏదో వాళ్ళకి ఇస్తుంటాను, ఆ వికృష్టపు జబ్బుతో బాధపడుతున్న ఆ కుష్ఠువాణ్ణి చూస్తే మనకు బాధేయటం లేదూ! అయినా మనం వారికి ఎలాటి సహాయం అందివ్వలేము గదా. అందుకే అప్పుడప్పుడు ఈ ముష్ఠి." జవాబును దగ్గరి స్నేహితులకు మాత్రం చెప్పేది సుజాత.

అందుకే ఆ స్కూల్లో సుజాతకో గౌరవం, ప్రత్యేకస్థానం ఉన్నాయి.

కానీ—ఆ కుష్ఠువాడు సుజాతకు కన్న తండ్రే అని నిజం తెలిసినప్పుడు మాత్రం—ఆ స్నేహం, గౌరవం ఎలా ఉంటాయనేది ప్రశ్నార్థకంగానే ఉంది. □